## సి.పి.ఐ ( ఎమ్.ఎల్ ) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు,

## కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి

# కామ్రేడ్ పి.జస్వంతరావుకి అరుణాంజలి !

- సి.పి.ఐ.(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి



**సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు, ''జనశక్తి'', ''క్లాస్ స్ట్రగుల్ ''పత్రికల సంపాదకులు, ''తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్'' ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ జస్వంతరావు 27.08.2020న కరోనాతో రాత్రి 8 గంటలకు హైదరాబాద్‌లో అంతిమ శ్వాస విడిచారు. కామ్రేడ్ పోలవరపు జస్వంతరావు మరణం మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.**

1947 మే నెల 29వ తేదిన గుంటూరులో శ్రీమతి విమల, శ్రీ జగన్మోహనరావు గార్లకు జన్మించారు. తండ్రి రెవెన్యూ డిపార్టమెంట్‌లో ఆర్.డి.ఒ.గా రిటైరయ్యారు. మంచితనంగల అధికారిగా పిల్లలను క్రమశిక్షణతో పెంచారు. జస్వంతరావు విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలను చేపట్టడం జగన్మోహనరావు గారికి మింగుడు పడలేదు. ఆ మేరకు ఒత్తిడికి గురవుతూ, ధిక్కారంతోనే విప్లవ రాజకీయాలకు నిబద్ధుడై నిలిచాడు. జగన్మోహనరావు మానవతావాది. సేవాతత్పరుడు. రిటైరైన తరువాత పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం మరణించేవరకు కృషిచేశారు.

కామ్రేడ్ జస్వంత్ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజిలో విద్యార్థిగా వుండగానే విప్లవ రాజకీయాలను స్వీకరించారు. 1970 నుండి ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొంటూ మార్క్సిస్టు అధ్యయన వేదికలో అధ్యయనం, చర్చల ద్వారా మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాన్ని జీవిత దృక్పథంగా స్వీకరించి అంకితమయ్యాడు. నాటి జాతీయ, అంతర్జాతీయ, ఆర్థిక, సామాజక, రాజకీయ, విప్లవ పరిస్థితుల మధ్య ప్రజాకార్య క్షేత్రంలో ప్రజలకోసం పనిచేయడానికి నిర్ణయించుకున్నాడు. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల తరపు తెగింపుతో ముందుకురికాడు. విద్యార్థిరంగం, సాహితీ సాంస్కృతిక రంగాలలో తన కార్యకలాపాలను ప్రారంభించాడు. గ్రామీణ పేదల, గిరిజన ప్రజల ఉద్యమాలకు బాసటగా నిలబడుతూ శ్రామిక వర్గతత్వాన్ని జీర్ణించుకున్నాడు. ఆ క్రమంలోనే 1975 జూన్ లో ఎమర్జెన్సీ విధించబడడంతో కామ్రేడ్ జస్వంత్ మరింత బరువైన పాత్ర నిర్వహించ వలసి వచ్చింది. ఆ బాధ్యతల నిర్వహణలో ఉండగానే 1976 ఆగస్టులో అరెస్టు అయ్యి రాజమండ్రి జైల్లో ఒకటిన్నర సంవత్సరాలు నిర్బంధించ బడ్డాడు. దీనితో ఆయన ఎమ్.బి.బిఎస్ చదువుకి ఆటంకం ఏర్పడింది. 1978 ప్రారంభంలో బెయిలుపై విడుదలయ్యాడు. పార్టీ నిర్ణయం ప్రకారం మిగిలిన సజెక్టులు పూర్తిచేసి హౌస్ సర్జన్ పూర్తిచేసి ఎమ్.బి.బిఎస్ సర్టిఫికెట్ పొందాడు. కానీ వైద్యం చేయడానికి బదులు ఆర్థికశాస్త్రంపై అవగాహనను పెంచుకునే కృషి చేశాడు. మార్క్సిస్టు సామాజిక శాస్త్రాలతో దోపిడీ వ్యవస్థకు సమూల చికిత్స చేయాలసిందేనని నిర్ణయించుకున్నారు. ఆర్థికశాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. కామ్రేడ్ నాగిరెడ్డిగారి స్థానాన్ని ఈ రంగంలో పూరించాలనే పట్టుదలతో అధ్యయనం చేశాడు. జనశక్తి పత్రికకు వ్యాసాలు రాస్తూ పత్రిక కోసం కాకినాడ నుంచే కృషి చేశాడు.

సుప్రసిద్ధ కళాకారుడు, నాటక రచయిత కామ్రేడ్ సుంకర సత్యనారాయణ మూడవ అమ్మాయి శేషమ్మను జస్వంత్‌కి వివాహం కోసం పార్టీ ప్రతిపాదించింది. అలా 1978 మే, 25 న కామ్రేడ్ శేషమ్మ జస్వంత్ జీవిత భాగస్వామిగా తోడయ్యింది. ఆమె ఉద్యోగంతోనే కుటుంబ భారాన్ని మోసింది.

వారికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు. శేషమ్మ పార్టీ కామ్రేడ్స్ పిల్లలను కూడా తన పిల్లలుగా స్వీకరించి పెంచింది. మిత్రబృందాలు, కామ్రేడ్స్ రాకపోకలతో ఏర్పడిన అదనపు భారాన్ని భారమనుకోలేదు. దాదాపు శేషమ్మ కుటుంబాలన్నీ అలాంటి పాత్రనే పోషించాయి. అలా బాధ్యతను తీసుకోవడం జాతీయోద్యమం కాలం నుండి వారికి వారసత్వంగా వస్తున్నదే.

కామ్రేడ్ జస్వంత్ 1981 నుండి 'జనశక్తి' తెలుగు పత్రిక, పార్టీ ఇంగ్లీషు పత్రికలు 'రెడ్ స్టార్', తరువాత 'వ్యాన్‌గార్డ్'ల బాధ్యతలను నిర్వహించాడు. 1992 నుండి జనశక్తి ఇంగ్లీషు పత్రికను బొంబాయిలో వుండి నిర్వహించే బాధ్యతను తీసుకున్నాడు. ఆ తరువాత 'యూనిటీ ఇనిషియేటివ్' ఇంగ్లీషు పత్రిక నిర్వహణ, ఆ తరువాత నుంచి నేటి వరకు కానూసన్యాల్ గారిచే స్థాపించబడిన 'క్లాస్ స్ట్రగుల్' ఇంగ్లీషు పత్రిక ఎడిటర్‌గా కృషిచేస్తున్నాడు. వివిధ విప్లవ నిర్మాణాలతో ఐక్యతల సందర్భాలలో నిర్మాణ అవసరాలకు తగ్గట్టుగా, మొత్తం ప్రజా ఉద్యమ అవసరాలకు తగ్గట్టుగా పార్టీ నిర్వహించినవే ఈ పత్రికలన్నీ. ఆగస్టు మొదటి వారం వరకు 'క్లాస్ స్ట్రగుల్' పత్రిక కోసం కేంద్రకమిటీ వైఖరులను ప్రకటించడంలో రచనలను సాగిస్తూనే ఉన్నాడు. ఆయన పార్టీ దృక్పథాన్ని తన రచనలలో విస్పష్టంగా ఉంచేవాడు. రాజకీయ నిర్మాణ దృక్పథం నుండి ఏ పరిస్థితిలోను వెసులుబాటు తీసుకోకుండా వుండటం ఆయన గొప్పతనం.

వివిధ సందర్భాలలో పాలకులు ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక విధానాలను నిశితంగా అధ్యయనం చేసి పత్రికల్లో ప్రతిబింబించేవారు. ఉదాహరణకు, నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలను, గాట్ ఒప్పందాలు భారత ఆర్థిక అభివృద్ధికోసమేనని ప్రచారం జరుగుతున్నప్పుడు, "తాకట్టులో భారతదేశం" అన్న టి.ఎన్. పుస్తకం ఆధారంగా ఎన్నో విశ్లేషణాత్మక వ్యాసాలు రాసాడు. దేశాన్ని అప్పులపాలు చేస్తున్న భారతపాలకుల దళారీ స్వభావం, కరడుగట్టిన, నూతనరూపాలలోకి మారుతున్న అర్ధ భూస్వామ్య స్వభావాన్ని అర్థం చేయించుడానికి పార్టీ సాగించే అధ్యయన కృషిలో నిబద్ధతతో భాగమయ్యే వాడు. పెట్టుబడిదారీ దుర్మార్గపు దోపిడీని, దేశీయ కంపెనీలను బహుళజాతి కంపెనీలు కబలిస్తున్న ఫైనాన్స్ కాపిటల్ అసలు రూపాన్ని బైటపెట్టడానికి నిరంతరం అధ్యయనం చేస్తూ ఆ విషయాలను వ్యాసాలలో పొందుపరిచేవాడు. గంటల తరబడి నిలబడి ఒకే ధారగా తనదైన శైలిలో ఇచ్చే ఉపన్యాసాలలో ఎప్పటికప్పుడు కొత్తవిషయాలు ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందించేవాడు. పాలకులు చెప్పే అంకెల గారడీలను అంకెలతోనే సాక్ష్యాలు చూపిస్తూ వివరించేవాడు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి శతజయంతి సభలలోనూ, వర్ధంతి సభలలోనూ, దేశంలోనూ రాష్ట్రంలోనూ ఎన్నో బహిరంగ సభలలో, సెమినార్లలో చాలా సంవత్సరాలుగా ప్రధాన వక్తగా ప్రసంగిస్తూనే వచ్చాడు. నిరంతరం ప్రజా ఉద్యమ ప్రయోజనాల గురించి, పార్టీ కమిటీల నిర్ణయాల అమలు గురించి ఆలోచిస్తూ సమిష్టి కృషిలో భాగంగా తనవంతు బాధ్యతలను మోస్తూ వచ్చాడు. పీడిత ప్రజలతో, పార్టీ కార్యకర్తలతో, శ్రేణులతో బాధ్యతా యుతంగా మసలుకునే సున్నిత మనస్కుడు.

నిరాడంబరుడు. వక్త, విప్లవ మేధావి అయిన కామ్రేడ్ పి. జస్వంతరావు మరణం పార్టీకి, విప్లవోద్యమానికి తీరని లోటు. జస్వంత్ సహచరి శేషమ్మకి, వారి పిల్లలకి, వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము.

**ఎస్. ఝాన్సీ**

**28-8-2020** **రాష్ట్ర కమిటీ,**

**సి.పి.ఐ. (ఎం-ఎల్) ఆంధ్ర ప్రదేశ్**

ంంం